# ప్రజారోగ్యంతో చెలగాటం



ఇటీవల అధికారులు తనిఖీ చేసి సీజ్ చేసిన చికెన్ సెంటర్ (ఫైల్)

- అపరిశుభ్రతకు నిలయంగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- చికెన్ సెంటర్‌లలో పాడైన మాంసం విక్రయాలు



ఆహారప్రియుడి ప్లేటులో మంచూరియాతో పాటు ఈగల వడ్డించిన నిర్వాహకులు(ఫైల్)



పాడైన క్యాబేజీని నిల్వ ఉంచిన నిర్వాహకులు

**మేడ్చల్,జూన్14:** హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ప్రజాఆరోగ్యంతో చెలగాట మాడుతున్నాయి. వంటకాల తయారీలో ఏమాత్రం నిబంధనలు పాటించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో కుళ్లిన, పాడైన పదార్థాల వినియోగంతో ఆహార పదార్థాలను తయారు చేస్తూ వినియోగదారుల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. 44వ జాతీయ రహదారిపై ఉండి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మేడ్చల్ పట్టణంలో వందలాది సంఖ్యలో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, కర్రీ పాయింట్లు, బేకరీలు ఉన్నాయి . ఎక్కడ కూడా నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### దారుణం..మాంసాహారం

మాంసాహారాన్ని విక్రయించే హోటళ్లు, ఫాస్ట్ సెంటర్‌లో పరిస్థితులు దారుణం ఉంటుంది. నాసిరకమైన చికెన్, మటన్, కోడిగుడ్లు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని కూడా ఎక్కువ కాలం ఫ్రిజర్‌లలో నిల్వ ఉంచుతున్నారు. ఫ్రిజర్‌లలో ఉంచి వాడటమే ప్రమాదకరం అంటే పాడైన మాంసాహారాన్ని పారవేయకుండా వినియోగిస్తున్నారు. ఆరోగ్యానికి హాని చేసే ఘాటైన మాసాలాలు, ఫుడ్‌కలర్‌లు, టేస్టింగ్ సాల్ట్‌తో మాంసాహారం పాడైనట్టు వినియోగదారులు గుర్తించకుండా చేస్తున్నారు. వాటిని తిన్న ఆహారప్రియులు అనారోగ్యం పాలవుతున్నారు. నూడుల్స్, ఫ్రైడ్ రైస్, మంచూరియాలో వినియోగించే క్యాబేజీ తదితర కూరగాయాలను కూడా పాడైనవి వినియోగిస్తున్నారు.అంతేగాకుండా హోటళ్ల కిచెన్‌లోకి వెళితే ఈగలు, దోమలు, బొద్దింకలు రాజ్యమేలుతూ ఆహారపదార్థాల్లో పడుతున్నాయి.

### మటన్ మంచిదేనా?

హోటళ్లు, చికెన్ సెంటర్‌ల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్న నేపథ్యంలో మటన్(మేక, గొర్రెల మాంసం) మంచిదేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మేడ్చల్ పట్టణంలో ప్రతి రోజు మటన్ విక్రయాలు జరుగుతాయి.ఆదివారం, పండుగ దినాల్లో క్వింటాళ్లలో విక్రయం జరుగుతుంది. ఇక్కడ కబేళా లేకపోవడంతో పరీక్షించి, అనుమతించే వైద్యుడు లేదు. ఎవరికి ఇష్టానుసారంగా వారు మేకలు, గొర్రెలను కోస్తూ విక్రయిస్తున్నారు. వినియోగానికి పనికిరాని జీవాలను కూడా విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### వంద రోజుల ప్రణాళికలో...

వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ అధికారులు హోటళ్లు, చికెన్ సెంటర్లలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిరంతరం తనిఖీలు నిర్వహించే ప్రత్యేక సిబ్బందికి ఏర్పాటు చేశారు. ఈ తనిఖీల్లో ఆహారపదార్థాలు, వంటగదులను పరిశీలిస్తూ సీజ్ చేస్తున్నారు. ఇటీవల పలు హోటళ్లు, చికెన్ సెంటర్లను సీజ్ చేసి, జరిమానా విధించారు.

### రెండు జిల్లాలకు ఒక్క అధికారే

ప్రజా ఆరోగ్యంపై ప్రభావం చూపేది ప్రధానంగా నీరు, ఆహారమే. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆహార తనిఖీలకు సంబంధించి అధికారులు, సిబ్బంది లేరు. మేడ్చల్ జిల్లాలో మొత్తానికి ఒక అధికారి మాత్రమే ఉన్నాయి.ఆయనకు ఒక్క సహాయకుడు మాత్రమే ఉన్నారు. వికారాబాద్ జిల్లా ఆహారభద్రతా అధికారిగా వ్యవహరిస్తున్న జగన్నాథం మేడ్చల్ జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. లక్షల సంఖ్యలో ఉన్న హోటళ్ల, రెస్టారెంట్లు, చికెన్ సెంటర్లను తనిఖీ చేయడం సాధ్యం అయ్యే పనికాదు.ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే అధికారి తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.ఏదీఏమైనా ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తే హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్, బేకరీల నిర్వాహకులపై నిఘా ఉంచి , నిబంధనల ప్రకారం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం



నిబంధనలు పాటించ ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలకు కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. చికెన్ సెంటర్లలో ఫ్రిజర్‌లను వినియోగించొద్దు. వినియోగానికి దూరంగా ఉండే పదార్థాలను వినిమయోగిస్తే సీజ్ చేస్తాం. హోటళ్లు, చికెన్ సెంటర్లు ఎక్కడా కూడా మట న్, చికెన్ నిల్వ ఉంచరాదు. అలా చేస్తే చర్యలు తప్పవు. మటన్ విక్రయాలపై కూడా పరిశీలిస్తాం.

**-నాగిరెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్, మేడ్చల్**

### నిబంధనలు పాటించాలి

హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఫుడ్‌లైసెన్స్ తీసుకోవాలి. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ(ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అండ్ ఆథారిటీ ఆఫ్‌ఇండియా) నిబంధనలు పాటించాలి. పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అన్‌సేఫ్ కింద కోర్టులో కేసులు నమోదు చేస్తాం. నాణ్యతారహితంగా ఉంటే అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)కు నివేదించి, జరిమానాలు విధించేలా చేస్తాం. తాను జిల్లాలో బాధ్యతలు చేపట్టిన తర్వా త 32 కేసుల్లో జరిమానా వేయించా.5 కేసులు కోర్టులో ఫైల్ చేశాం.మరో 6కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

**-జగన్నాథం, ఇన్‌చార్జి ఆహార భద్రతా శాఖ అధికారి, మేడ్చల్**

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి:ఎమ్మెల్యే



కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మల్లాపూర్, జూన్ 14:** అభివృద్ధి పనులోల నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మీనానగర్ కాలనీలో రూ.3.5 లక్షలతో బ్రహ్మపురి కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్,స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌లో రక్తదాన శిబిరం




రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

**మేడ్చల్, జూన్ 14:** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ దవాఖానలో ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు దవాఖానకు తరలివచ్చి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న తరచుగా రక్తదానం చేస్తూ అత్యవసర పరిస్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా హాస్పటల్‌కు వచ్చి, అవసరంలో ఉన్న రోగులకు రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ ఎంకే బోస్, డైరక్టర్లు రాజిరెడ్డి, ఆలీబేగ్, డీన్ వెంకట్ రాంనాయక్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి వెంకటరామనాయక్, మేనేజర్ దుర్గా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**రామంతాపూర్,జూన్ 14:** విద్యుత్ మరమ్మతుల కారణంగా శ్రీకృష్ణా ఫీడర్ పరిధిలోని అజంతా హోటల్‌లైన్,శ్రీకృష్ణాఫార్మలైన్,లక్ష్మీనారాయణ కాలనీ,టెనెక్స ఇండిస్ట్రీ,ఏయిర్‌టెల్ ఆఫీస్‌లైన్,లక్ష్మీప్లాస్టిక్ ఆర్గానిక్స్,నుషరత్ ఇండిస్ట్రీ,నిషాన్ సర్వీస్,శ్రీసాయికాల నీరోడ్డు నంబర్ 1,3 వరకు ,అనుప్రింటర్స్,ఐడిఏ ఏరియా సరౌండింగ్ ఏరియాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి. కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.







## త్వరలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు.

**రామంతా పూర్,జూన్ 14:** నాచారం డివిజన్ సాయినగర్ కాలనీ వైజయంతి టాకీస్ వెనుక వీధిలో భూగర్భ డ్రైనేజీ సమస్యతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హామీ ఇచ్చారు. శనివారం ఎన్నో ఏండ్ల క్రితం ఏర్పాటుచేసిన చిన్న సైజు డ్రైనేజీ పైపుల వల్ల నిత్యం డ్రైనేజీలు నిండి రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను కలిసి విన్నవించారు. నూతన భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశబూరు. త్వరలోనే నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతామని కాలనీ వాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

## డివిజన్ అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల

**ఉప్పల్, జూన్ 14 :** డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. డివిజన్లోని న్యూరాంనగర్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ బన్నాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగకుండా, నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఈఈ హరిలాల్, డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి, జగన్, శ్రీనివాస్ యాదవ్, నారాయణరెడ్డి, శ్యాం బంటి గౌడ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బలరాం, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

**రామంతాపూర్, జూన్ 14:** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం డాన్స్ టీచర్ శ్రావణి ప్రియా శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మహాగణపతి, కొలువైతివా రంగా సాయి, చక్కని తల్లికి, మాధవ కేశవా, జతిస్వరం, మండూక శబ్దం, రామాయణం నృత్య రూపకం అంశాలను దివ్య, రిషిక, జష్మిత, కార్తీక, మాన్విత, సాయి చంద్రప్రియా, అభిరామి, షార్వి, సాయి ప్రగతి , అన్విత, సరితా, చరన్వి, నైతిక రెడ్డి, అశ్విని, శ్రీవల్లి, సాయి కీర్తన, సాయి సహస్ర , శ్రీ సంజన తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు. ప్రముఖ నాట్య గురువర్యులు కూచిపూడి కళానిపుణ రవి కళాకారులను అభినందించారు.



శిల్పారామంలో చిన్నారులు చేస్తున్న కూచిపూడి నృత్యం

## జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన




కేసులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డి.కిరణ్‌కుమార్, ఇతర న్యాయమూర్తులు తదితరులు

**చర్లపల్లి, జూన్ 14:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి ప్రారంభించారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 19బెంచీలు ఏర్పా టు చేసి క్రిమినల్ కేసులు, మోటర్ ప్రమాద కేసులు, గృహ హింస, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంక్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 525, లక్ష ఎనభై వేల ఐదు వందల యాభై ఒకటి అన్ని రకాల క్రిమినల్ కేసులు, 35ప్రీటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భం గా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కక్షిదారుల కేసు ల సత్వర పరిష్కారం కోసం ఏర్పా టు చేసిన జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన వచ్చిందని, జిల్లా వ్యాప్తంగా 19బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించామని ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లో కోటి ఎనభై నాలుగు లక్షల ఎనభై ఎనిమిది వేల ఆరు వందల పదిహేడు రూపాయలను పరిహారం కిం ద చెల్లించామని ఆయన తెలిపారు. జాతీయ లోక్ అదాలతో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డిలతో పాటు పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత యోగా శిక్షణ శిబిరం

**రామంతాపూర్,జూన్ 14 :** ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామంతాపూర్ నెహ్రూనగర్‌లో కమ్యునిటీహాల్‌లో ఈనెల 15 నుంచి నెల రోజుల ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నాని యోగాచార్య బొడ్డు రవీందర్ తెలిపారు. ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 924622288, సంప్రదించాలన్నారు.

## 18న వేలం పాట

**పోచారం,జూన్14:** పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ శ్రీరంగనాథస్వామి ఆలయంలో పూజా సామగ్రి, కొబ్బరి కాయల విక్రయ వేలం పాటను ఈనెల 18 నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలంను ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 1, 2025నుంచి,జూలై31,2026వరకు కొబ్బరి కాయలు,పూజా సామగ్రిని విక్రయాలను నిర్వహించుకోవచ్చునని వివరించారు.ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10,000 చెల్లించాలని ఈవో సూచించారు.

## ఫినిషింగ్ రాడ్ల ధ్వంసం

**పోచారం,జూన్14:** పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ గ్రామంలోని చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌రాడ్లను గుర్తు తెలియన వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వసం చేశారు. శనివారం గమనించిన స్థానికులు దళితుల దృష్టికి తీసుకెళ్లగా దళిత నాయకులు పాండురాజు, రాజేష్‌లు పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.విగ్రహన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించిన వ్యక్తులను గుర్తించి శిక్షించాలని దళిత నాయకులు కోరారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

**ఘట్‌కేసర్, జూన్ 14:** తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఘట్‌కేసర్ లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 17న 4వ తరగతి ప్రవేశం కోసం 3వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులు అని చెప్పారు. ఈ ప్రవేశానికి 2016 సెప్టెంబర్ 1నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోనఫైడ్ సర్టిఫికెట్, 3 వ తరగతి ప్రోగ్రెస్ కార్ట్, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఘట్‌కేసర్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు శ్రీరాములు సెల్ నంబర్ 96405 01084 ను సంప్రదించాలన్నారు.

## వ్యాపార దృక్పథం పెంపునకు బీటూబీలు దోహదం



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న సీఈవో అభినవ్ రెడ్డి

**మేడ్చల్,జూన్14:** వ్యాపార దృక్పథం పెంపునకు బీటూబీ (బడ్ టూ బిజినెస్) లాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని సీఎంఆర్ విద్యా సంస్థల కార్యదర్శి గోపాల్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్లో శనివారం బీటూబీ పేరిట వ్యాపార అంకురార్పణ పోటీలను ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమలకు అనుగుణంగా ఆలోచించే సామర్థ్యం పెంచుకోవాలన్నారు. మార్కెట్ అవసరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు వ్యాపార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అంతేగాకుండా ఈ పోటీలతో టీం వర్క్, సమయ పాలన, సమాచార నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. బీటూబీ పోటీల్లో 300 జట్లకు గాను 77 జట్లు ఎంపికయ్యాయి. ఎంపికైన జట్లు చూపిన ప్రతిభ ఆధారంగా నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో అభినవ్ రెడ్డి, డైరెక్టర్ నారాయణ, ప్రిన్సిపాల్ శేషుకుమార్, డీన్ దేవదాస్, సీర్ హెడ్ సురేశ్ రాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసం కృషి చేయాలి



పట్టాలను అందజేస్తున్న చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి

**మేడ్చల్, జూన్ 14 :** ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు భవిష్యత్‌లో సమాజ హితం కోసం కృషి చేయాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి అన్నారు. కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....విద్యా ప్రయాణం ఇక్కడితో ఆగకూడదని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రజకు వృతిదారులపై కరెంటోళ్ల వేధింపులు ఆపాలి



నాచారంలో ధర్నా కరపత్రం విడుదల చేస్తున్న రజక సంఘం నేతలు.

రామంతాపూర్,జూన్ 14: రజక వృత్తి దారులపై కరెంటోళ్ల వేధింపులు ఆపాలని మేడ్చల్ జిల్లా రజక సంఘం గౌరవాధ్యక్షులు అంబటి చక్రపాణి,ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం నాచారం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరాపార్కు వద్ద ఈనెల 17న నిర్వహించే ధర్నాకు రజకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు సర్ధార్,అశోక్, రెడ్డి, రాజులు, నర్సయ్య, భాస్కర్, బాలచందర్, మైసయ్య, బాలరాజు, శ్యామ్ ,శ్రీనివాస్,లక్ష్మయ్య పాల్గొన్నారు.


## అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



అన్నోజిగూడలో అంగన్‌వాడీ కేంద్రంలో చేరుతున్న పిల్లలు

**పోచారం,జూన్14:** పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహకాలనీలోని అంగన్‌వాడీ 2 కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పి.జ్యోతి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తల్లులకు ప్రీస్కూల్ విద్యపై టీచర్ జ్యోతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో 6 సంవత్సరాలు నిండిన 8మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.


## ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**శామీర్‌పేట, జూన్ 14 :** ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోతారంలో శనివారం ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, జగన్నాథం, ఎంసీపల్లి ఉపసర్పంచ్ వెంకటరమణా రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

## ఘనంగా ఉర్సు



ఉర్సులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

**శామీర్‌పేట, జూన్ 14 :** తూంకుంట మున్సిపాలిటీ శామీర్‌పేట పరిధిలోని సయ్యద్ జలాలుద్దీన్ ముల్తానీ బాబా ఉర్సు ఉత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. మత పెద్దలు, గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఛాదర్, మిఠాయిలతో ఫ్యాతియాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకుడు మహ్మద్ హాజి, మశీదు ఇమాన్ ఇమ్తియాజ్, హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, అఫ్జల్‌ఖాన్, మహ్మద్ ఇర్ఫాన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, నజమ్, ఒవైస్ అహ్మద్ ఖాన్, మహ్మద్ అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.